కథా నిలయం
శ్రీకాకుళం

# అభాగ్యాధిపతి

"సారూ! ఓ ఆఫీసరుసారూ! జెర గిటు జూడండ్రి సారూ!" వీరాంజనేయడు సంజీవ పర్వతాన్ని దించుకున్నట్టు భుజాల మీదున్న ఫైళ్ళ కట్టను, పదిలంగా టేబుల్ మీద... ఆఫీసర్ హరిశ్చంద్రిని... సత్యహరిశ్చంద్రుని టేబుల్ మీదుంచి ఊపిరి పీల్చుకున్నాడు అటెండరు. హర్చిశ్చంద్రునికేమీ కనిపించలేదు, వినిపించలేదు. రింగ్ ఛైర్ వెనక్కి జేరగిలబడి... పాల సముద్రం పై శేషతల్పమున పవళించిన శేషశాయిలాగు న్నాడు. కళ్ళు మూతలు పడున్నాయి. పరిమితంగా తెరిచి ఉన్న నోటిలో దూరాలని అపరిమితమైన దోమలు అదే పనిగా తిరగాడుతున్నాయి.

ఆఫీసర్‌ది నిద్రావస్తనా లేక జాగృతావస్తనా? నిద్రిస్తుంటే... మగత నిద్రనా లేక గాఢ నిద్రనా?... మరెన్నో సందేహాలు పొటమరించి అడెండర్ బుర్ర భూగోళంలా గిర్రు గిఱ్ఱుమంటోంది.

గాసారు బతికున్నాడా, సచ్చిపోయిండా? అతి పెద్ద అనుమానం... హడల్....! సన్నని గురక వినిపించింది. అనుమానం పటాపంచలైంది. పొద్దున్నే పది రూపాయల నోటు దానం దొరికిని ముష్టివాడిలా మురిసిపోయాడు.

అసలే... అటెండర్‌గా ఆ ఉద్యోగం కొత్త.

క్లర్క్‌గా పని చేసేటప్పుడే కలం కదిలిస్తూ కునికి పాట్లు పడటం హరిశ్చంద్రునికల వాటైంది. సీనియారిటీ ఎదిగే కొద్దీ ఆఫీసులో హాయిగా నిద్ర పోవటంలో చక్కని, చిక్కని ప్రావీణ్యం అబ్బింది. ఆఫీసరనే అందలమెక్కాక కలాన్ని పక్కకు నెట్టేసి గురకు ఆవహించింది.

అతి పెద్ద ప్రభుత్వ కంపెనీ కది పరిపాలనా విభాగం. అందులోనూ పి.ఎఫ్. (ప్రావిడెంట్ ఫండ్స్ సెక్షన్) సగటు ఉద్యోగుల అర్జంట్ అవసరాలు తేర్చే కల్ప తరువులాంటిది. పి.ఎఫ్., అడ్వాన్సులు, విత్ డ్రాయల్స్ ఫైనల్ పేమెంట్.... అన్నింటికీ మంజూరు కాయితాలక్కడి నుంచే బయలుదేరుతాయి. దానికి హెడ్డు సత్యహరిశ్చంద్రుడు.

అర లక్ష రూపాయలు అప్పనంగా వెచ్చించి అటెండరు ఉద్యోగం కొనుక్కోక ముందు ఈ కొత్త అటెండరుకు అడుక్కోవడంలో ఐదారేళ్ళ అనుభవముంది. బస్టాండ్, బసవేశ్వరాలయం, చౌరస్తా, సాని వీధి.. అన్నీ సమానమే. అంతటి అనుభవ సారమే పట్టుదలని విక్రమార్కునిగా మార్చేసింది. ఎలాంటి వాడినైనా సెంటిమెంటు మాటలతో కరిగించడంలో దిట్ట.

"సారూ...ఓ సారూ! అందులో ఐదారు అర్జంట్ ఫైళ్ళొచ్చి నై. మీకు పుణ్యముంటుంది. మీ పిల్లా పాప చల్లగా ఉంటారు కాని జెర జూడండ్రి సారు!" దేవరించాడు.

దున్నపోతు మీద రాళ్ళ వాన పడ్డట్టు...ప్చ్... లాభం లేదు.

ఆర్నెల్ల క్రితం టేబుల్ మీదికొచ్చిన అర్జంట్ ఫైళ్ల కట్టలోంచి ఒకటి లాగి రెండు వాక్యాలు రాసి అలసి పోయిన గుమాస్తా గుర్నాధం ఆవులింతలం దుకుంటున్నాడు.

ఆఫీసర్ను సతాయిస్తున్న కొత్త అటెండర్ మీద కోపమొచ్చిందతనికి.

"ఏయ్! నువ్వెళ్ళు. నిద్రాభంగం మహాపాపం...." మందలించాడు. అటెండరు ఊరుకోలేదు.

"పాపం! ఆయనెవరో రిటైరై మూడున్నరేండ్ల యిందటా! వాళ్లమ్మాయి పెళ్ళటా. పి.ఎఫ్. ఫైనల్ పేమెంట్ శాంక్షన్ కాలేదట సారు వారూ! పాపం...."

"అయితే మాత్రం... బంగారం లాంటి నిద్ర బుగ్గిపాలు జేస్తవా?" హాయిగా ఆవులిస్తూ చిటికేసుకున్నాడు.

"పాపం ముసలాయన. కళ్ళల్లో వత్తులేసుకుని ఎదురు చూస్తుంటాడు సామీ! జెరదయ జెయ్య రాదా!"

గుట్టంత మనిషి గుర్నాథంకు ఇంట్లో అసలే నిద్ర రాదు. కనీసం.. ఆఫీసులోనన్నా ఓ కునుకు తీద్దామంటే వీడొకటి..

"ఎవడయ్యా ఆ ముసలి పీనుగా?" తిక్కరేగింది. ఎత్తైన బొజ్జ ఎగిరి పడింది. "వారం తరువాత రమ్మను. పో!"

"ఇప్పటికే వందల వారాలు తిరిగేడంట. జెర గీ ఆఫీసర్ను మీరన్నా లేపుండ్రి. లేకపోతే పాపం... వాళ్ళమ్మాయి పెళ్ళి ఆగిపోతుందటా. పాపమా ముసలాయన మనాఫీసు చుట్టూ తిరిగే బదులు మార్వాడి గల్లీల అడుక్కున్నా మారాజు లెక్క బిడ్డ పెళ్ళి చేసేటోడు... అయినా గా ఫైలు గింత కాలం పెండింగ్లుండుడు అన్నాయం గదయ్యా!"

"నువ్వు నోర్మూసుకుంటావా, లేదా?"

"పాపం... గా ముసలాయనేమన్నా దాన ధర్మం జెయ్యమంటున్నడా? పదో పరకనో అడుక్కుని... ఆర్డర్ కాయితమిస్తే కొట్టిన ఐపాయె" గుర్నాథం సహనం కొండకేసి కోడి గుడ్డులాగైంది.

"యూ షటాప్ అండ్ గెటవుట్..." గాడిద ఓండ్ర పెట్టినట్టు గట్టిగా అరి చాడు. సగం నిద్రలో ఉన్నవాడు జడుసుకున్నారు. అటెండర్ ఊపిరి పీల్చుకున్నాడు.

ఆఫీసర్ హరిశ్చంద్రుడు ఆవులించాడు. "ఎందుకా అరుపులు? మేత చాల లేదా?" ఫెవికాల్తో అతికించినట్టున్న కనురెప్పలు తెరచుకోబోయి విఫలమైనాయి.

"నీ యవ్వ నీ...." అంటెండరుగ్గూడా కొపమొస్తోంది. "నీకు దండం బెద్త గాని లెవ్వుండ్రయ్యా!"

పాపం! అటెండర్ ఉద్యోగానికి కొత్త. ఆఫీసు వాతావరణం అర్థం కాలేదింకా. కోపాన్నాపుకుని సతమతమైపోతున్నాడు.

ఇది పి.ఎఫ్. సెక్షనా, పవళింపు సెక్షనా? లేక నేనేమన్నా కలగంటు న్నానా?.... చెంప గిల్లుకున్నాడు. చురుక్కుమంది. గిరుక్కున తిరిగి, వెళ్ళి విభాగధిపతికి విన్నావించాడు. . ప్రమోషన్ మీద కొత్తగా వచ్చి ఎమోషనల్గా పని చేస్తున్న విభాగాధిపతి వింతగా చూశాడు. రెచ్చిపోవాలనకున్నాడు. పి.ఎఫ్. సెక్షన్కు తక్షణమే తరలొచ్చాడు. సెక్షన్లో స్టైల్గా అడుగు పడింది.

పిట్ట అరుపులు, పిల్లి కూతలు వినపడుతున్నాయి. కాని కలం పోట్లు, కాయితాల కదలికలు కనబడలేదు.

ఈ వింత శబ్దతరంగా లేమిటబ్బా! విస్తుబోయి నోరెల్లబెట్టాడు. రెండు మూడు సెంకండ్లలో నాలుగైదు దోమలు నోట్లో దూరాయి. నోరు ఠక్కున మూత పడింది. అటెండర్ నోరు తెరవబోయి మానుకున్నాడు.

"ఇక్కడి సార్లంతా నిద్రలు తీస్తున్నారు. పెద్దసారూ!"

ఓహో! ఇది గురక రాగ మాధుర్యమా? ఒంటినిండా ఉప్పు కారం రాసుకున్నట్లైంది విభాగాధిపతికి. జుట్టు పీక్కోవాలనిపించింది. గంతులెయ్యాలని పించింది. ఏదో ఆరాటం. ఆవేశం... ఎందుకైనా.. మందిదని "మిస్టర్ హరిశ్చంద్రుడూ! సత్యహరిశ్చంద్రుడూ!" చెవి వద్ద పిలుస్తూ వీపు తట్టాడు. మొన తేలిన విభాగాధిపతి మీ సాలు హరిశ్చంద్రుని చెంపకు పరంబాయె, చెయ్యకేదో ఆదేశమాయె. చెంప ఛెళ్ళుమం ది. ఒళ్ళు ఝల్లుమంది. విభాగాధిపతి కళ్లు బైర్లు కమ్మినై.

"వామ్మో.. నా చెంప!" చిన్న పిల్లాడిలా చెంప పుణుక్కున్నాడు. నిద్రాదేవి కౌగిట్లోంచి జారి మిగతా ఉద్యోగులు ఉన్న ఫళంగా ఈ లోకానికొచ్చేశారు.

విభాగాధిపతి గింజుకుంటున్నాడు.

"అయిపోయింది. హరిశ్చంద్రుల వారు ఆన్‌ది స్పాట్ సస్పెండ్ కావడం ఖాయం" గుమస్తాల గుసగుసలు. నిద్రాసక్తుల రుసరుసలు.

"మన సెక్షన్ హెడ్డు పని గోవిందా... గోవిందా!" టైపిస్టుల పిసపిసలు.

కాలు మీద కాలేసుకుని హరిశ్చంద్రుడు గట్టిగా ఆవులించాడు. కళ్ళు తెరుచుకున్నాయి. ఎదురుగా.

గుండె గుభేల్‌మంది. ఏం చెయ్యాలో తోచలేదు.

చిన్న సబ్బార్టినేట్స్ ముందు పెద్ద సబార్టి నేటుతో లెంపకాయ తిన్నందుకు తల తీసి మొలేసినట్టనిపించింది విభాగాధి పతికి. గండబేరుండ పక్షిలాగున్న మొహం.. బహు వర్ధ చిత్రమైంది ముక్కుపుటాలెగిరి పడుతున్నాయి.

"మిస్టర్ సచ్చె హరిశ్చందురుడూ! గెటప్. ఐసే గెటప్!" టాప్ ఎగిరిపోయేలా అరిచాడు. ఎందుకైనా మందిదని గుమస్తాలు సవినయంగా లేచి కూర్చున్నారు. హరిశ్చంద్రునిలో కదలిక కనిపించిందప్పుడే.

"బద్మాష్! తోలు మందమైందా? తోకఝాడించుడు నీ వంతే, అరవడమూ నీ వంతేనా?" ముంచుకొస్తున్న అయోమయం.. బరువుగా లేచి నుంచున్నాడు.

"బద్మాష్ కాదు... మన పెద్దాఫీసరు సారూ!" అటెండర్ విన్నవించు కున్నాడు.

హరిశ్చంద్రుడు అసహనంగా కళ్ళు నులుముకున్నాడు. ఎదురుగా విభాగాధిపతి చెంప నిమురుకుంటున్నాడు. మొహం నిప్పుల మీద కాల్చిన నీలం వంకాయలాగుంది.

"అబ్బో! ఇది ఆఫీసు గదా!" లెంపలేసుకున్నాడు.

"ఆఫీసు కాపోతే ఆర్మూరు బస్టాండనుకున్నావా?" విభాగాధిపతికి పిడికిలి కసిదీరా టెబుల్ మీద గద్దుకుంది. చెయ్యి మంటెక్కింది. టేబుల్ మీద పేపర్ వెయిట్ జారి మోకాలు చిప్ప మీద పడింది. వెన్నుపూసలో ఝల్లమంది. కల్లు తాగిన కోతి నిప్పు తొక్కినట్టయింది. "అసలూ... ఆఫీసంటే ఏమనుకున్నావ్?" గొంతు ఆసాంతం చించుకున్నాడు. పొట్టతో సహా టాప్ టు బాటం కదిలిపోయింది.

"అ... అదీ పశువుల కొట్టం...." సత్య హరిశ్చంద్రుడు ఏదో చెప్పబోయాడు.

"ఇది పశువుల కొట్టమా? ఐతే మేమంతా పశువులమా?" నెత్తి కొట్టుకున్నాడు. "ఐతే మరి తమరేమిటటా?"

"ప....ప.....పశువుల కొట్టం..."

"మళ్ళీ అదే కూత....!" మరింత గట్టిగా గుద్దెయ్యాలని పిడికిలి గాల్లోకి లేచి, నొప్పి గుర్తుకొచ్చి... నిస్సహాయంగా వేళ్ళాడింది.

"సారీ సర్! రాత్రంతా పశువుల కొట్టంలో పని, నిద్ర లేదు. అందుకే... కాసింత కన్నంటుకుంది. అంతే సా....ర్..."

"మా నాయనే పశువుల కొట్టంలో పంజేశావా!" అయోమయం... "చూశావా! నువు కొట్టిన దెబ్బకు నా చెంప ఉబ్బి పూర్ణం బూరె అయింది. దీని సంగతేమంటావు?" ఏడుపు రాబోతోంది. తమాయించుకోవడం. వినా మరో దారి లేదు.

"అదే సర్... అలా కాసింత కన్నంటుకుందో లేదో ఇలా పశువుల కొట్టంలో పడిపోయాను సార్...." చేతులు జోడించాడు. విభాగాధిపతిని వింతగా చూస్తున్నారంతా. మొమం వేలాడేసిన పెద్దాఫీసర్‌కు పిచ్చెక్కినట్లయింది. జుట్టు పీక్కున్నాడు. నుదురు కొట్టుకున్నాడు. "ఆ పశువుల కొట్టమేమిటో, పేడ తీయడమేమిటో... నా పిండా కూడేమిటో! ఇది ప్రావిడెంటు ఫండు సెక్షనా లేక పిచ్చాసుపత్రా?" బుర్ర బరా బరా గోక్కున్నాడు.

"ఇది పి.ఎఫ్. సెక్షన్ సార్? కాని... మాయావిడా...."

"అదిగో... మళ్లీ అదే పిచ్చిమాట." అరికాలు మంట నెత్తికెక్కింది. "మీయావిడకూ, పశువుల కొట్టానికీ, ఈ ఆఫీసుకూ.. సంబంధమేమిటటా?" అమాంతం మింగెయ్యాలని పించింది. పెదాలు బిగుసుకుంటూ విడిపోతున్నాయి.

"ఉంది. సార్! ప్లీజ్ ఇది వినండి సార్...."

"నేను ఇల్లరికం అల్లుణ్ణి సార్! మావిడకు వాళ్ళ పెద్దల నుంచి సంక్రమించిన పశుసంపదను కంటికి రెప్పలా కాపాడతానని గట్టిప్రామిస్ చేశాను సార్! అప్పటి దాకా మూడు ముళ్ళు వేయనీయలేదు. ఆవిడ వెంట ఏడడుగులు నడిచిన పాపానికి గత ఏడేళ్ళ నుంచి నన్ను నలుపుకు తింటోంది సార్. రోజూ బురదలో దొర్లి వచ్చిన పశువుల్ని సుబ్బరంగా కడగడం, పేడ తీసి కొట్టం ఊడ్వడం, పశువులకు మేత వెయ్యడం, పాలు పితకడం, వాటి తన్నులు తినడం... అనక మాయావిడ నోటి తిట్లు ఈసడింపులు వినడం.. భరించలేక పోతున్నాను సార్!" గోడు వెళ్లబోసుకున్నాడు.

"అయ్యో పాపం! భార్యా బాధితుడివా?" ఎమ్మెల్యే ఎలక్షన్‌లో ఏడో సారి గెలిచిన అభ్యర్థిలా విభాగాధిపతి ముఖారవిందము వికసించింది. కోపం కొండెక్కి పోయింది. సత్యహరిశ్చంద్రునికి సందు దొరికింది.

"అవున్సార్! రాత్రంతా పశుపోషణ, పగలంతా పి.ఎఫ్. ఫైళ్ళతో కుస్తీ నా బతుకు బేగంపేట విమా నాశ్రయమైపోయింది సార్!"

విభాగాధిపతిలో ఆసక్తి అంగలేసింది. ఉత్సాహం. మొగ్గ తొడిగింది.. అందరినీ కూర్చోమని పైగ చేస్తూ... "మరా చెంప దెబ్బ సంగ తేమిటటా?" కుర్చీ లాక్కుని తానూ కూర్చున్నాడు. చెవులు చేటలై పోయినై.

"మరేమో.... మాయా విడ తిట్లను నెమరేసుకుంటూ పాలు పితికేందుకు తయార య్యాను బుగ్గల మీద సిగ్గుల ఛాయలు పొటమరించాయి. గేదె అనుకుని దున్నపోతు వెనక్కు వెళ్ళాను అది తోక ఝూడించింది. ఆ తోక వెంట్రుకలు నా చెంపలకు గుచ్చుకున్నై. నాకెక్కడో మండింది. దాని చెంప మీద గట్టిగా ఒక్కటిచ్చాను సార్!"

విభాగాధిపతి వింత చూపులు అటెండర్ను తడిమినై.

పొత్తి కడుపులోంచి పొంగుకొస్తున్న నవ్వునాపుకుంటున్నాడు అటెండర్. "మీరు చెంపదెబ్బ కొట్టంది దున్నపోతును కాద్సార్. గీ....మన పెద్దాఫీసర్ సారును" కిసుక్కుమన్నాడు.

"అలాగా! అయితే.... అది కల... కలన్నమాటా!" అప్పుడే జ్ఞానోదయం మైన గౌతమ బుద్ధుడిలా గయ్యాడు.

"కలనో... వైష్ణవ మాయణో" కోప మొచ్చింది పెద్దా పీసరుకు. "ఛిఛీ... పట్ట పగలు ఆఫీసులో ఆద మరిచి నిద్ర పోవడమా? నిద్రలో కలలు కనడమా? కలలో పశువులు కొట్టమా?...." దిగ్గున లేచాడు. "డిసిప్లీనంటే ఇదేనా? ఫైళ్ళ క్లియరెన్స్ ఇట్లానే ఉంటుందా?" గుమస్తాల మీదికి గుడ్లు తెరిచాడు. వాళ్ళింకా గుసగుసల్లోంచి బయట పడలేదు.

"మీరంతా చెవులు కొరుక్కుంటున్నా రెందుకు?" గద్దింపు.

"కొరుక్కు నేందుకు గోళ్ళు లేవు" గుర్నాదం వినయం. గుండెల్లో గూడ్సు రైలు పరిగెడుతున్నా బయటికి గాంభీర్యం.

"సారీ సర్" విభాగాధిపతి చేతులు హరిశ్చంద్రుని చేతుల్లోకొచ్చినై. "మీకూ ఓ అందమైన భార్య ఉంటే, ఆవిడ చేతిలో మీరో కీలుబొమ్మయిపోతే... నా పరిస్థితి పూర్తిగా అవగాహనయ్యేది." సెంటిమెంటుతో కొట్టాడు.

"అలాగా!" విభాగాధిపతి డీలా పడి కుర్చీలో కూలబడ్డాడు. అప్పుడే అంటించిన దీపం పత్తిలా పెలిగింది మొహం. "నాగ్గూడా అందమైన భార్య ఉందయ్యా! నేను గూడా.... " ఏదో గుర్తుకొచ్చింది. "సరేగాని నీ సంగతి పూర్తిగా చెప్పెయ్!"

"అనాడు... దోర వయసులో....నా భార్య ఓర చూపుల్లో ఇరుక్కుపో యాను. మా ఇంటి సంగతి గాలి కొదిలేసి ఇల్లరికాని కొప్పుకున్నాను. మూడు ముళ్ళయ్యాక, మూడు రాత్రులు ముచ్చటగా గడిచినై. ఏడు రోజులు తర్వాత ఆవిడ అసలు నైజం

బయటపడింది. ఓర చూపులు, కోర చూపులు మాయమూపోయినై. పశువుల శాలలో పరిపరి విధాల మందలింపులు, చురచుర చూపులు... మోచేతి పొడవులు.... నిప్పుల మీద నడిపిస్తుందంటే నమ్మండి. మొగ పుట్టక పుట్టే కంటే అడవిలో ఆముదం. చెట్టుకు ఆకునై పుడితే బాగుండేదనిపిస్తుందిసార్!" బోర్ మన్నాడు.

ఆఫీసు స్టాపు.... ఆదమరచి వింటున్నారు,

"హుర్రే... వారెవ్వా!" ఎగిరి గంతేశాడు విభాగాధిపతి. "మా భాబాసం కో కొత్త సభ్యుడు దొరికాడోచ్..." మురిసిపోతున్నాడు.

"భాబాసమా?" బిత్తరబోయాడు. సత్యహరిశ్చంద్రుడు.

"అదేం భాష సార్?" అడిగేశాడు.

"తేనెలూరు తెలుగు భాష భాబాసం అంటే భార్యా బాధితుల సంఘము దాంట్లో నాకు క్రియాశీల సభ్యుత్వమున్నదయ్యా!"

"అలాగా! నేను కూడా భాబాసంలో చేరిపోతాను సార్. కాని.... దానిగూడా నా భార్య పర్మిషన్ కావాలి గదా సార్!"

"చిఛీ.. ఇంకా భార్యకు బానిసగానే బతకాలనుకుంటున్నావా? అసలూ.... భర్త అంటే భార్యతో బడిత దెబ్బలు తినేవాడు. కాదు...." గంభీరోపన్యాసం గంగా ప్రవాహ వేగాన్నందుకుంది. "భర్తంటే భార్యకు ప్రత్యక్ష దైవం. భార్యా పిల్లల్ని భరించేవాడు. భార్య.. అదే ఇల్లాలంటే ఇంటికి దీపమే కాని మొగుని కంట్లో నలుసు కాదు. భార్యకు భర్త ఎందుకు భయపడాలయ్యా?..." చూపులు శూన్యంలోకి చొచ్చుకుపోతున్నాయి. అనుకోకుండా... మనోయవనిక మీద పెళ్ళాం ప్రత్యక్షమైంది. ఆవిడకోపంగా ఉంది. చేతిలో పొడగాటి కర్ర ఉంది. మొహంలో రంగులు మారుతున్నాయి. పక్కన హరిశ్చంద్రుని భార్య. ఆమె చేతిలో తిరగేసిన చీపురు కట్ట. ఇద్దరి కొంగులు బొడ్లో.... ముందుకు...ముందుకు... దూసుకొస్తున్నారు.

"భ....భ....భాబా...బ..స్సం....బబ....." గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. ఒళ్ళంతా చెమట పడుతోంది. నాలిక పడచగట్టుకు పోతున్నట్లుంది. అటెండరందించిన గ్లాసెడు నీళ్ళు గటగటా తాగేశాడు.

"ఎందుకైనా మంచిది. నీ భార్య పర్మిషన్ తీసుకో....." దీర్ఘ రోగిలా లేచి కుష్ఠు రోగిలా అడుగులేస్తూ నిష్క్రమించాడు.

అరెరె.... పులిలాంటి విభాగాధిపతి పిల్లి పిల్లై పోయాడేమిటి?

"వెరీ ఫైన్ మన విభాగాధిపతి అభాగ్యాధిపతన్నమాట!" సత్యహరిశ్చంద్రుడు సగర్వంగా తలెత్తాడు.

పగలబడి నవ్వుతున్నారంతా.

"మనమంతా బాగా నటించాం గదూ!"

"పెద్దాఫీసరు భార్యా బాధితుడని తెలవడం నయమైంది."

"ఈ ఒక్క వీక్ పాయింట్ చాలు.. పెద్ద తలకాయలో దుమారం రేపేందుకు...."

ఒకరికొకరు అభినందనలు చెప్పుకుంటున్నారు.

అవులింతలకుపక్రమిస్తున్నారు.

"ఆఫీసులో కాకపోతే అంగడిలో నిద్రపోతామా?" అంటూ తృప్తిగా ఊపిరి పీల్చి కుర్చీల్లో చేరగిలబడుతున్నారు. పి.ఎఫ్.శాంక్షన్ కోసం బయట పడిగాపులు కాస్తున్న ముసలాయన ఎవ్వరికీ గుర్తుకు రాలేదు.

పరిస్థితి ఆసాంతం అర్థమైందనుకుని కొత్త అటెండర్ పాత గుంపులో గోవిందయ్యగా మారిపోయాడు. స్టూలు మీద స్టైల్‌గా కూర్చుని ఆవులింతల పాక్టీసు కుపక్రమించాడు.

"మిస్టర్ హరిశ్చంద్రుడూ!" గడప అవతల నుంచుండి అంతా విన్న విభాగాధిపతి వెనుతిరిగొచ్చి ఉరిమాడు. "యు ఆర్ సస్పెండెడ్!" కంచు కంఠం ఖంగుమంది. "మీరు మామూలు నటులైతే నేను మహా నట సామ్రాట్‌ను."

"అమ్మో! విభాగాధిపతి అభాగ్యాధిపతి అనుకున్నాను గాని.... హరిశ్చంద్ర మారాజే ఆగమైపోయిండు" గొణుక్కుంటూ భయంతో వణికిపోతూ లేచినుంచున్నాడు. చేతులు కట్టుకు నుంచున్నాడు.

**సురభి, పక్ష 15-30 ఏప్రిల్ 2003**

❖ ❖ ❖

